సాక్షి ఒడిశా

బుధవారం । 12 । జూన్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,10,817లు, బంగారం 7 గ్రాముల 50 మిల్లీగ్రాములు, వెండి 20 గ్రాముల 850 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



లైన్ క్లియర్..!

ఎట్టకేలకు నబరంగ్‌పూర్–జయపూర్–మల్కన్‌గిరి జిల్లాల రైల్వే లైన్ నిర్మాణానికి మోక్షం కలగనుంది.

- 8లో



మావో డంప్ స్వాధీనం

మల్కన్‌గిరి జిల్లాలోని మత్తిలి సమితి తులసిపాహడ్‌లో రెండో బెటాలియన్‌కు చెందిన బీఎస్‌ఎఫ్ జవాన్లు మావో డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసిన ఎమ్మెల్యే గౌరీ శంకర్



కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో ఎమ్మెల్యే గౌరీ శంకర్

కొరాపుట్: కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌ను నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మంగళవారం భువనేశ్వర్‌లో మంత్రి ఆశీస్సులు పొందారు. గౌరీ రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ధర్మేంద్ర సహాయ సహకారాలు అందజేస్తున్నారు. 2019లో నబరంగ్‌పూర్ బీజేపీ టిక్కెట్ ఇప్పించడంలో ధర్మేంద్ర ప్రోత్సాహం ఉంది. అప్పుడు ఓటమి పాలైనా మరలా 2024లో గౌరీకి అదే స్థానంలో టిక్కెట్ లభించగా పోటీచేసి బీజేపీ తరుపున విజయం సాధించాడు.

బాధ్యతలు స్వీకరించిన అశ్వినీ వైష్ణవ్



బాధ్యతలు స్వీకరిస్తున్న కేంద్రమంత్రి ఆశ్వినీ వైష్ణవ్

కొరాపుట్: కేంద్ర రైల్వే, సమాచార–ప్రచార, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ క్యాబినెట్ మంత్రిగా అశ్వినీ శ్రీ వైష్ణవ్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన వరుసగా రెండోసారి పదవీ బాధ్యతలు స్వీకరించడం గమనార్హం. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన అశ్విని ఒడిశా కేడర్ ఐఏఎస్ అధికారి. దీంతో ఒడిశా రాష్ట్రం నుంచి బీజేపీ తరుపున రాజ్యసభ ఎంపీగా ఎంపికవుతూ ఒడిశా వాసిగా గుర్తింపు పొందారు. రాజ్యసభకు ఆయనను ఎంపిక చేయడంలో బీజేడీ సైతం మద్దతు ఇస్తుండడం విశేషం. అశ్విని తన ఉద్యోగ నిమిత్తం ఒడిశా రాష్ట్రవ్యాప్తంగా పని చేశారు. ఒడియా భాషపై పూర్తి పట్టుంది. అందుకే పార్లమెంట్‌లో ఒడిశా ఎంపీలు అడిగిన ప్రశ్నలకు అశ్విని ఒడియా భాషలో సమాధానం చెబుతారు. అవిభక్త కొరాపుట్ జిల్లాలో రైల్వే సేవలు పెరగడానికి అశ్విని కృషి ఉంది.

ఆపద్బాంధవులకు రివార్డులు



రివార్డులు అందజేస్తున్న ఎస్పీ స్వాతీకుమార్

పర్లాకిమిడి: రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను సకాలంలో దగ్గరలో ఉన్నటువంటి ఆస్పత్రులకు తరలించి కాపాడిన స్థానికులకు ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ మంగళవారం రివార్డు కింద రూ.2 వేలు అందజేశారు. వారు కాశీనగర్ పోలీసుస్టేషన్ పరిధి లంగ్‌పగుడా గ్రామానికి చెందిన నాగేష్ శోబోరో, సురేష్ శోబోరో, గురండి పోలీస్‌స్టేషన్ పరిధి పాటికోటకు చెందిన ఎస్. హరికృష్ణలు. వీరికి రూ.2 వేల చొప్పున నగదుతో పాటు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

కేరళలో వలస కార్మికుడి మృతి



జయసింహ మాఝి (ఫైల్)

రాయగడ: కేరళలో రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి జిల్లాలోని కాసీపూర్ సమితి మునుసుగా పంచాయతీలోని కటెలపాదొరొ గ్రామానికి చెందిన జయసింహ మాఝి (45)గా గుర్తించారు. గత పది రోజుల్లో ఈ ప్రాంతానికి చెందిన ఇద్దరు వలస కార్మికులు మృతి చెందడంపై సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. జయసింహ రెండు నెలల క్రితం కుటుంబ పోషణకు తోటి స్నేహితులతో కలిసి ఉపాధి కోసం కేరళ వెళ్లాడు. ఈ క్రమంలో ఒక ఇంటిపనిలో నిమగ్నమైన అతను పైనుంచి కింద పడిపోయాడు. ఈ ఘటన గత ఆదివారం జరిగింది. తీవ్రగాయాలకు గురైన అతనిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతడు సోమవారం రాత్రి మృతి చెందాడు. సమాచారాన్ని కుటుంబీకులకు తెలియజేయడంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అయితే మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నూతన ముఖ్యమంత్రిగా..

మోహన్ మాఝి



కృతజ్ఞతలు తెలుపుతున్న మోహన్ చరణ్ మాఝి



రాష్ట్ర శాఖ అధ్యక్షుడితో మోహన్ చరణ్ మాఝి తదితరులు

- ఉప ముఖ్యమంత్రులుగా కనక వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా
- ఖరారు చేసిన బీజేపీ అధిష్టానం
- నేడు ప్రమాణ స్వీకారం



ప్రభాతి పరిడా



కనక వర్ధన్ సింగ్‌దేవ్

భువనేశ్వర్: రాష్ట్రంలో తొలి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ముఖ్యమంత్రిగా మోహన్ మాఝి, ఉప ముఖ్యమంత్రులుగా కనక వర్ధన్ సింగ్‌దేవ్, ప్రభాతి పరిడాలు ఖరారయ్యారు. కెంజొహర్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన మోహన్ మాఝి ముఖ్యమంత్రిగా ఖరారవ్వడం విశేషం. 4 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మోహన్ మాఝిని మంగళవారం స్థానిక రాష్ట్ర కార్యాలయంలో జరిగిన బీజేపీ శాసనసభా పక్ష సమావేశం తర్వాత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. గిరిజన నాయకుడైన ఆయన గతంలో రాష్ట్ర శాసనసభలో బీజేపీ విప్‌గా పని చేశారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజూ జనతా దళ్‌కు చెందిన మీనా మాఝిని 11,577 ఓట్లతో ఓడించారు.

ఉప ముఖ్యమంత్రులుగా ఇద్దరు

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ తరహాలో రాజ్‌నాథ్ సింగ్ రాష్ట్రంలో ఉప ముఖ్యమంత్రులుగా కనక వర్ధన్ సింగ్‌దేవ్, ప్రభాతి పరిడాను నియమించారు. పట్నాగొడా పూర్వపు రాజ కుటుంబానికి చెందిన కనక వర్ధన్ సింగ్‌దేవ్ పట్నాగొడా నియోజకవర్గం నుంచి ఆరోసారి ఎన్నికయ్యారు. అతను గతంలో బీజేపీ – బీజేడీ సంకీర్ణ ప్రభుత్వం (2000 – 2009) సమయంలో పరిశ్రమలు మరియు ప్రభుత్వ రంగ సంస్థల మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 3 వరుస పరాజయాల తర్వాత ప్రభాతి పరిడా బిజూ జనతా దళ్ కంచుకోట నిమ్మపడాలో సిట్టింగ్ ఎమ్మెల్యే సమీర్ రంజన్ దాస్‌ను బీజేపీలోకి చేర్పడంతో పాటు 4,588 ఓట్ల తేడాతో సమీప ప్రత్యర్థి దిల్లీప్ కుమార్ నాయక్‌ను ఓడించి సత్తా చాటుకున్నారు. నవీన్ పట్నాయక్ నేతృత్వంలో బిజూ జనతా దళ్ 24 ఏళ్ల పాలనకు తెర దించుతూ 147 అసెంబ్లీ స్థానాలకు గాను 78 స్థానాలను కైవసం చేసుకుని బీజేపీ బలమైన పార్టీగా తొలిసారిగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుండడం విశేషం. బుధవారం సాయంత్రం 4.45 గంటలకు స్థానిక జనతా మైదానంలో ప్రమాణస్వీకారోత్సవం జరగనుంది. దీనికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ నేతృత్వంలోని రాష్ట్రాలకు చెందిన పలువురు ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెడతాం



శ్రీజగన్నాథుని ఆశీస్సులతో రాష్ట్రంలో బీజేపీ భారీ ఆధిక్యత సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. మార్పు కోసం ఓటు వేసి రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకు రావాలని నిర్ణయించుకున్న నాలుగున్నర కోట్ల మంది ఒడియా ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఒడిశా ప్రజలు చూపిన నమ్మకాన్ని బీజేపీ తప్పకుండా నిలబెడుతుంది.

– సీఎం మోహన్ చరణ్ మాఝి

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



గాయాలతో ఉన్న ధనంసి భొత్ర



చికిత్స పొందుతున్న సంతోష్

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి ఇంతాలిగుడ మలుపులో బైకు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ముగ్గురు వ్యక్తులు తీవ్రగాయాలకు గురయ్యారు. మంగవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి గాయాలైనవారిలో రఋగుడ గ్రామానికి చెందిన సంతోష్ బిడిక(25), సుబ రాణిక (27), ధనంసి భొత్ర (55)లు ఉన్నారు. మంగవారం ఉదయం వీరు ముగ్గురూ బైక్‌పై తడిజోల గ్రామానికి ఒక పని మీద వెళ్లి, తిరిగి వస్తున్న సమయంలో ఇంతాలిగుడ మలుపులో బైకు అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్రగాయాలకు గురైన వారిని అటువైపు వెళ్తున్న కొందరు చూసి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం అంబులెన్స్ సాయంతో కల్యాణ సింగుపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి దారుణ హత్య



కిరిబిరి అడవుల్లో మృతదేహాన్ని వెదుకుతున్న పోలీసులు

- పెళ్లికి నిరాకరించడంతో హత్య చేసిన ప్రేమికుడు
- గుణుపూర్ పోలీసుస్టేషన్‌లో లొంగుబాటు



నిటు నౌరి (ఫైల్)



మాన్యువల్ సబర్ (ఫైల్)

రాయగడ: ఇద్దరూ ప్రేమించుకున్నారు. ఒకరినొకరు అర్థం చేసుకున్నారు. పెళ్లి చేసుకుని ఆనందమయమైన జీవితాన్ని కొనసాగిద్దామని ప్రేమికురాలిని ప్రియుడు ఒప్పించాడు. అయితే వీరిద్దరి పెళ్లికి ప్రేమికురాలి తల్లిదండ్రులు ససేమిరా అంగీకరించకపోవడంతో కోపోద్రేక్తుడైన ప్రేమికుడు పథకం ప్రకారం ప్రేమికురాలిని పిలిచి హత్య చేసిన అనంతరం ఒక అడవిలో మృతదేహాన్ని పారేసిన ఘటన జిల్లాలో సంచలనం సృష్టించింది. తన కూతురుని హత్య చేశాడంటూ బిసంకటక్ పోలీసుస్టేషన్‌లో ప్రేమికుడిపై యువతి తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో తప్పించుకోలేనని తెలిసి, సరాసరి జిల్లాలోని గుణుపూర్ పోలీసుస్టేషన్‌లో ప్రేమికుడు లొంగిపొయాడు.

మనస్తాపంతో హత్య

వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని బిసంకటక్‌లో నివాసముంటున్న నిటు నౌరి (23) అనే యువతితో గుణుపూర్‌లోని మరాటిగుడ గ్రామానికి చెందిన మేన్యూవ్ సబర్ (28) అనే యువకుడు ప్రేమలో పడ్డాడు. ఇదే క్రమంలో తన ప్రేయసిని కలిసేందుకు సరాసరి బిసంకటక్ వెళ్లి మాట్లాడి వస్తుండేవాడు. అయితే ఇక పెళ్లి చేసుకుందామని అందుకు తల్లిదండ్రులకు ఒప్పించమని ప్రేయసిని అడిగాడు. తమ పెళ్లికి ఇంట్లో ఒప్పుకోవడం లేదని యువతి తన ప్రియుడితో చెప్పడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలోనే సోమవారం తన ప్రేయసికి ఫోన్‌చేసి ఒకసారి మాట్లాడాలని రమ్మన్నాడు. అందుకు అంగీకరించిన ఆమె కలిసేందుకు వెళ్లింది. అప్పటికే బిసంకటక్‌లో ఉన్న సబర్ తన వ్యూహం ప్రకారం ప్రేమికురాలిని హత్య చేశాడు. అనంతరం ఆ మృతదేహాన్ని బిసంకటక్ సమీపంలోని కిరిబిరి అడవుల్లో పడేశాడు. తిరిగి ఏమీ తెలియనివాడిలా తన స్వగ్రామమైన గుణుపూర్ వెళ్లిపోయాడు. ఇంట్లో కుమార్తె లేకపోవడంతో అంతా వెతికిన తల్లిదండ్రులు మంగళవారం ఉదయం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇది తెలుసుకున్న సబర్ సరాసరి గుణుపూర్ పోలీసుస్టేషన్‌లో లొంగిపోయాడు. తానే హత్య చేసి మృతదేహాన్ని పారివేసిన విషయాన్ని పోలీసులకు తెలియజేశాడు. దీంతో బిసంకటక్ పోలీసులు అడవిలో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజృంభిస్తున్న అతిసార



స్థానికులతో మాట్లాడుతున్న వైద్య బృందం

జయపురం: కొరాపుట్ జిల్లా సెమిలిగుడ సమితి సెమిలిగుడ గ్రామంలోని గౌడవీధిలో అతిసార విజృంభిస్తోంది. వాంతులు, విరోచనాలతో దాదాపు 40 మందికి పైగా ప్రజలు పీడించబడుతున్నారు. బాధితుల్లో చిన్నారులతో పాటు మహిళలు, పురుషులు ఉన్నట్లు సమాచారం. విషయం తెలిసిన వెంటనే సెమిలిగుడ సమితి అధికారులు, జిల్లా వైద్య బృందాలు ఆ ప్రాంతానికి మంగళవారం చేరుకున్నాయి. వైద్య బృందాలు బాధితులకు పరీక్షలు జరిపి వారికి అవసరమైన మందులు ఇస్తున్నారు. అలాగే ఆ వీధిలో ప్రజలందరికీ వైద్య పరీక్షలు జరుపుతున్నారు. బాధితులను గుర్తించి వారికి గ్రామంలోనే వైద్య సేవలు అందజేస్తున్నారు. ఆ ప్రాంత ప్రజలు వినియోగిస్తున్న నీటి నమూనాలను సేకరించి పరీక్షల కోసం జిల్లా కేంద్రానికి పంపినట్లు వైద్యులు వెల్లడించారు. ఆ ప్రాంతాలు పరిశుభ్రంగా లేకపోవడం, రక్షిత తాగునీరు వనరులు లేకపోవడమే అతిసార వ్యాధికి కారణంగా భావిస్తున్నారు. నివాస ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గోరు వెచ్చని నీటిని తాగాలని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పరిస్థితులు అదుపులోకి తీసుకొచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వైద్య బృందానికి నేతృత్వం వహిస్తున్న డాక్టర్ నీల మాధవ శతపతి వెల్లడించారు.

మోదీ ప్రమాణ స్వీకారానికి తెలుగోడు



కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మాధవీలతలతో చంద్ర



మోదీ ప్రమాణ స్వీకారం వేదిక వద్ద చంద్రశేఖర్ పట్నాయక్

కొరాపుట్: దేశ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ 3వ సారి ప్రమాణ స్వీకారం చేశారు. అయితే ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా తిలకించడానికి కొరాపుట్ జిల్లా జయపూర్‌కి చెందిన ఒక తెలుగు యువకుడికి ఆహ్వానం రావడం, అతను హాజరవ్వడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జయపూర్ పట్టణంలోని సాంబారు తోట అనే వెనుకబడిన ప్రాంతానికి చెందిన వి.చంద్రశేఖర్ పట్నాయక్ ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారానికి వెళ్లారు. కొన్నేళ్ల క్రితం చంద్రశేఖర్ తన తండ్రికి చెందిన టైర్ల దుకాణంలో పనిచేసేవాడు. దుకాణంలో టైర్లు మరమ్మతులు చేస్తూ ఇంటర్, గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. అనంతరం ఉద్యోగ అన్వేషణకు హైదరాబాద్ తరలివెళ్లాడు. అక్కడ విరించి గ్రూపు వ్యాపార సంస్థల్లో చిరుద్యోగం లభించింది. ఈ సంస్థలో ఎంతో నమ్మకమైన ఉద్యోగిగా పని చేశాడు. దీంతో యాజమాన్యం చంద్రకు పదోన్నతి కల్పించింది. చంద్ర తన పని తీరుతో సంస్థ యజమాని కొంపెల మాధవీలత దృష్టిలో పడ్డాడు. ఇదే సమయంలో బీజేపీ కేంద్ర నాయకత్వం తమకు పంటి కింద రాయిలా ఉన్నటువంటి హైదరాబాద్ లోక్‌సభ స్థానంలో అసదుద్దీన్ ఒవైసీపై పోటీకి మాధవీలతను బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దింపింది. దీంతో ఆ ఎన్నికల సమయంలో మాధవీలతకి ఎన్నికల వ్యూహాల్లో చంద్ర చేదోడువాదోడుగా ఉన్నాడు. దీంతో పీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మాధవీలతతో పాటు చంద్రకి ఆహ్వానం వచ్చింది.

4 ద్వారాలు తెరిచేందుకు సన్నాహాలు



భువనేశ్వర్: ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన పూరీలో భక్తుల సౌలభ్యం కోసం శ్రీజగన్నాథ దేవస్థానం నలువైపులా ఉన్న ద్వారాలు తెరిచేందుకు సన్నాహాలు ఊపందుకున్నాయి. ఒకటి, రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి కానున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. శ్రీజగన్నాథ ఆలయ పరిపాలనా యంత్రాంగం (ఎస్‌జేటీఏ) ఆలయం నాలుగు ద్వారాలను తెరిచే ప్రక్రియను ప్రారంభించింది. దీంతో దర్శనం కోసం రద్దీ తొలగి సులభ దర్శనం ప్రాప్తిస్తుందని భక్తులు దీర్ఘకాలంగా అభ్యర్థిస్తున్నారు. పూరీ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ప్రత్యేక బృందం శ్రీజగన్నాథ ఆలయాన్ని సందర్శించింది. క్షేత్రస్థాయిలో వాస్తవ స్థితిగతులను ఈ బృందం పరిశీలించిందని అధికారిక వర్గాలు తెలిపాయి.

ద్వారాలు తెరవడానికి ఏర్పాట్లు

ప్రస్తుతం మందిరంలోని సింహద్వారం మాత్రమే సందర్శకుల కోసం తెరిచి ఉంది. ఆలయ ఇతర రెండు ద్వారాలను తెరవడానికి తగిన ఏర్పాట్లు చేస్తారు. దాదాపు ఒకటి రెండు రోజుల్లో ఆలయం నాలుగు ద్వారాలు తెరుచుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఈ ఏర్పాట్లతో సింహద్వారం తెరుచుకోగా, మిగతా మూడు గేట్ల దగ్గర జిగ్‌జాగ్ బారికేడ్లు, చెప్పుల స్టాండ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సింహద్వారం వద్ద భద్రతా తనిఖీలు మాదిరిగా మిగిలిన ద్వారాల గుండా ప్రవేశం పురస్కరించుకుని ఆలయాన్ని సందర్శించే సందర్శకులకు బారికేడ్ వద్ద భద్రతా తనిఖీలు చేస్తారు. ప్రత్యేక పూజాదికాల సమయంలో మందిరం లోపల మూల విరాటు దేవతలను సాఫీగా, ఇబ్బంది లేకుండా దర్శనం చేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోనున్నారు. దర్శనం కోసం ఆలయ నాలుగు ద్వారాలను తెరిచేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతుండటం గమనార్హం. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తన ఎన్నికల హామీల్లో రాష్ట్రంలో అధికారంలోకి వస్తే శ్రీమందిరం నాలుగు ద్వారాలను తెరుస్తామని ప్రకటించింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బిజూ జనతా దళ్ (బీజేడీ)పై విజయం సాధించి రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్న తరుణంలో తొలి వాస్తవ కార్యాచరణగా భక్తులు, యాత్రికుల సౌకర్యానికి శ్రీమందిరం 4 ద్వారాలు తెరిచేందుకు సన్నాహాలు చేపడుతోంది.

క్లుప్తంగా

ఈనెల 30 వరకు సెలవులు రద్దు

భువనేశ్వర్: రాష్ట్రంలో ప్రభుత్వ సిబ్బంది సెలవులను ఈనెల 30వ తేదీ వరకు రద్దు చేసినట్లు మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈనెల 12 నుంచి కొత్త ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పాలన, ప్రజాభియోగాల విభాగం అదనపు ముఖ్య కార్యదర్శి సురేంద్ర కుమార్ అన్ని శాఖల అధిపతులు, జిల్లా కలెక్టర్లుకు అధికారిక లేఖలో ఈ విషయం తెలిపారు. కొత్త ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో కొత్త కార్యాచరణతో ప్రభుత్వం యొక్క వివిధ స్థాయిల్లో చాలా కార్యకలాపాలు ఉంటాయి. ఈ పరిస్థితి దృష్ట్యా రాబోయే రోజుల్లో తలెత్తే ఏవైనా అత్యవసర పనులకు హాజరు కావడానికి ప్రభుత్వ అధికారులందరూ తమ తమ ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉండటం తప్పనిసరి అని లేఖలో స్పష్టం చేశారు. అందువల్ల జూన్ 30 వరకు ప్రభుత్వ సెలవు దినాల్లో (ఆరోగ్య కారణాలపై మినహా) సెలవులు లేదా ప్రధాన కార్యాలయాన్ని విడిచిపెట్టడానికి ప్రభుత్వ అధికారి అనుమతించబడరని లేఖలో పేర్కొన్నారు.

నేడు ప్రభుత్వ సిబ్బందికి ఒకపూట సెలవు

భువనేశ్వర్: రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి, మంత్రి మండలి ప్రమాణ స్వీకారోత్సవం దృష్ట్యా భువనేశ్వర్‌లోని అన్ని రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టులు బుధవారం మధ్యాహ్నం 1 గంట తర్వాత మూసివేయబడతాయని అధికారికంగా ప్రకటించారు. భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) పరిధిలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలతో పాటు రెవెన్యూ, మెజిస్ట్రీరియల్ కోర్టులు (ఎగ్జిక్యూటివ్) మధ్యాహ్నం 1 గంటల నుంచి మూసివేయబడతాయని రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌లో తెలిపింది.

మావో డంప్ స్వాధీనం



డంప్‌లో స్వాధీనం చేసుకున్న సామగ్రి

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి తులసిపాహడ్‌లో రెండో బెటాలియన్‌కు చెందిన బీఎస్ఎఫ్ జవాన్లు సోమవారం రాత్రి కూంబింగ్‌కు వెళ్లారు. అనంతరం మంగళవారం ఉదయం తిరిగి వస్తున్న సమయంలో కిరిమట్ల గ్రామ సమీప అడవిలో ఒకచోట మావోలు అమర్చిన డంప్‌ను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. డంప్‌లో ఒక కేజీ టిఫిన్ బాంబ్, ఒక సోలార్ ప్లేట్, వైరు, ఒక జాత మావో దుస్తులు, కత్తి, టార్చ్‌లైట్, 3 వందల గ్రాముల గన్ పౌడర్, బ్రెస్, పేస్టు, సబ్బులు, కరెంటు వైరు ఉన్నాయి. దీంతో మావోల కోసం కూంబింగ్ కొనసాగుతోంది.

అండర్-23 నార్త్‌జోన్ క్రికెట్ పోటీలు ప్రారంభం

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నుంచి అండర్-23 నార్త్ జోన్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు ప్రారంభించారు. మొదటి రోజు శ్రీకాకుళం-విశాఖపట్టణం జట్లు తలపడగా, మొదట బ్యాటింగ్ చేసిన విశాఖ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 273 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన శ్రీకాకుళం జట్టు 31.1 ఓవర్లలో 138 పరుగులకే ఆలౌటైంది.

కూలిన చెట్టు.. తప్పిన ప్రమాదం



నుజ్జునుజ్జు అయిన దుకాణం

టెక్కలి రూరల్: స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని ఒక చెట్టు(తురాయి) మంగళవారం ఒక్కసారిగా కూలిపోయింది. రోడ్డు పక్కగా ఉన్న దుకాణాలు వెనుక వైపు ఉన్న ఒక చెట్టు కూలీ సమీప దుకాణాలపైన పడిపోయింది. దీంతో అక్కడే ఉన్న టైలరింగ్ షాపు పూర్తిగా పాడైపోయింది. షాపు టైలరింగ్ చేస్తున్న నీలిమ అనే మహిళకు స్వల్పగాయాలయ్యాయి. చెట్టు పడేటప్పుడు పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఘటన స్థలానికి చేరుకుని షాపు పైన పడిన చెట్టును తొలగించే ప్రయత్నంచేశారు. చెట్టు పడే టప్పుడు సమపంలో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

కృష్ణలంక (విజయవాడ తూర్పు): విద్యుదాఘాతానికి గురై ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన కృష్ణలంకలో మంగళవారం జరిగింది. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం లుక్లాపేట గ్రామానికి చెందిన జొన్నాడ నీలయ్య(50) కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సుమారు 20 ఏళ్ల కిందట భార్య, కుమారుడితో కలిసి నగరానికి వలస వచ్చి భానునగర్‌లో నివసిస్తున్నాడు. అప్పటి నుంచి భవన నిర్మాణ పనుల్లో భాగంగా సిమెంట్ కబోర్డులు నిర్మించే పనికి మేస్త్రీ వెంట కూలికి వెళ్తున్నాడు. మంగళవారం ఉదయం కృష్ణలంక, శంకరమఠం రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఒక ఇంటిలో కబోర్డుల పనికి వెళ్లాడు. పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. తోటి కార్మికులు హుటాహుటిన సమీపంలోని ఆస్పత్రికి నీలయ్యను తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

లైన్ క్లియర్..!

- నబరంగ్‌పూర్, మల్కన్‌గిరి జిల్లాల్లో రైల్వేలైన్‌పై ఆశలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో బీజేపీ ఉండడంతో మోక్షం
- ఇప్పటికే ఎంఓయూలు పూర్తి



కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో బలభద్ర మఝి



ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో నబరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మఝి

కొరాపుట్:

ఎట్టకేలకు నబరంగ్‌పూర్-జయపూర్-మల్కన్‌గిరి జిల్లాల రైల్వే లైన్ నిర్మాణానికి మోక్షం కలగనుంది. ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ సర్కార్ కొలువుదీరడంతో సుదీర్ఘ కాలంనాటి ఈ సమస్యకు పరిష్కారం దక్కనుంది. ఈ నిర్మాణం కోసం సంవత్సరాల తరబడి రాజీలేని పోరాటం చేస్తున్న బలభద్ర మఝి బీజేపీ తరుపున నబరంగ్‌పూర్ నుంచి గెలుపొందడంతో మరింత ఆశలు పెంచాయి. బ్రిటీష్ కాలం నుంచి జయపూర్-నబరంగ్‌పూర్, నబరంగ్‌పూర్-జునాగడ్ రైల్వే లైన్లు నిర్మించాలని ప్రతిపాదన ఉంది. జునాగడ్ నుంచి మెయిన్ లైన్‌కి ఇప్పటికే మార్గం ఉంది. అదేవిధంగా జయపూర్-మల్కన్‌గిరి, మల్కన్‌గిరి - భద్రాచలం నిర్మాణాల కోసం ప్రతిపాదనలు ఉన్నాయి. వీటిలో తొలి విడతగా నబరంగ్‌పూర్-జయపూర్-మల్కన్‌గిరిల మధ్య నిర్మాణం పూర్తి కావాలి. అందుకే ఈ మార్గంపై డిమాండ్ కొనసాగుతూ ఉంది.

నిర్మాణ ప్రయత్నం

జయపూర్-నబరంగ్‌పూర్‌ల మధ్య 38 కి.మీ నిర్మాణం కోసం అనేక సర్వేలు ఆమోదం తెలిపాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం కూడా అంగీకరించింది. గతంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని నవీన్ ప్రభుత్వంతో చర్చలు జరిపి ఎంఓయూలు కుదుర్చుకుంది. దాని ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం భూమి ఇవ్వాలి, కేంద్రం రైల్వే నిర్మాణం చేయాలి. అయితే కేంద్ర, రాష్ట్రాల్లో వేర్వేరు ప్రభుత్వాలు ఉండడంతో రాష్ట్రం భూమి ఇవ్వలేదని కేంద్రం ఆరోపించింది. కానీ కేంద్రం రైల్వే లైన్ నిర్మాణంపై నిర్లక్ష్యం వహించిందని రాష్ట్రం ఆరోపించేది. కానీ ప్రభుత్వం రెండుచోట్ల బీజేపీ ప్రభుత్వమే ఉండడంతో నిర్మాణం తప్పనిసరిగా పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ మార్గంలో నిర్మాణం కోసం గత కేంద్ర బడ్జెట్‌లో రూ.174 కోట్లు కేటాయించింది. దానిలో భాగంగా ఇంద్రావతి నదిపై వంతెనతో పాటు జయపూర్ నుంచి 13 కి.మీ నిర్మించాల్సి ఉంది. ఆ పనులు నిర్మాణంలో ఉన్నాయి. ఇక జయపూర్-మల్కన్‌గిరి ల మధ్య 130 కి.మీ దూరం లైన్ నిర్మించాల్సి ఉంది. ఈ మార్గంలో టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది.

అనుకూల పరిస్థితి

కేంద్ర రైల్వే శాఖలో దేశవ్యాప్తంగా అత్యధిక వేతనాలు అందుకునే తొలి పదిమంది ఉన్నత ఉద్యోగుల్లో పనిచేసిన వారిలో బలభద్ర మఝి ఒకరు. తన పదవీ కాలం ముగియకుండానే రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చారు. రాష్ట్రంలో రైల్వేలైన్ లేని 5 జిల్లాల్లో నబరంగ్‌పూర్, మల్కన్‌గిరి జిల్లాలు ఉన్నాయి. ఈ రెండు జిల్లాలు నబరంగ్‌పూర్ లోక్‌సభ పరిధి లోనివే. దేశవ్యాప్తంగా అనేక రైల్వే నిర్మాణాల్లో తన ఇంజినీరింగ్ ప్రతిభ చూపిన బలభద్ర తన సొంత ప్రాంతంలో రైల్వే లైన్ నిర్లక్ష్యంపై బాధపడేవారు. 2014లో బీజేడీ టిక్కెట్‌పై నబరంగ్‌పూర్ ఎంపీగా గెలిచి ఈ ప్రతిపాదన ముందుకు సాగేందుకు చాలా కృషి చేశారు. 2019లో బీజేపీ టిక్కెట్టుపై పోటీచేసి ఓడిపోయినా తన ప్రయత్నాలు వదలలేదు. తరచూ కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ని కలిసి సమస్య వివరించేవారు. అశ్వినిని చాలాసార్లు అవిభక్త కొరాపుట్ జిల్లాల పర్యటనలకు రప్పించి ఈ సమస్య తీవ్రత చూపించారు. ఆ ప్రయత్నంలో భాగంగానే కేంద్ర-రాష్ట్రాల మధ్య ఒప్పందం, భూసేకరణ, నిధులు మంజూరు, పనులు ప్రారంభం జరిగాయి. ఇప్పుడు బలభద్రే బీజేపీ ఎంపీగా ఉండడం, రెండుచోట్ల బీజేపీ సర్కార్ వంటి పరిస్థితి వలన నిర్మాణాలు యుద్ధ ప్రాతిపదికన జరిగే అవకాశం ఉంది.

నిర్మాణం పూర్తి చేస్తాం: ఎంపీ బలభద్ర మఝి

నబరంగ్‌పూర్-జయపూర్-మల్కన్‌గిరి ప్రాంతాల మధ్య రైల్వేలైన్ నిర్మాణం పూర్తి చేస్తామని నబరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మఝి తెలియజేశారు. ఈ మేరకు సోమవారం న్యూఢిల్లీ నుంచి కొరాపుట్ సాక్షి ప్రతినిధితో ఫోన్లో మాట్లాడారు. ఈ సమస్య సుదీర్ఘకాలంగా ఉందన్నారు. ఈ నిర్మాణం వలన వెనుకబడిన ఈ జిల్లాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని పేర్కొన్నారు. ఇప్పటికే కేంద్రంలో అశ్వినీ శ్రీవైష్ణవ్ రైల్వేమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో హర్షం వ్యక్తం చేశారు. నబరంగ్‌పూర్ ఎంపీ స్థానంతో పాటు, ఈ పార్లమెంటరీ స్థానం పరిధిలో 5 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ గెలుపుతో మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు.



ప్రతిపాదిత రైల్వేలైన్లు

మాజీ సీఎం నవీన్‌కు ఆహ్వానం

భువనేశ్వర్: భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో తొలిసారిగా ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఈనెల 12న కొత్త ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల ప్రమాణ స్వీకారం అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్‌కు బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ అధ్యక్షతన ప్రతినిధి బృందం ఆహ్వానించింది. ఆహ్వాన ప్రతినిధి బృందంలో మన్మోహన్ సామల్‌తో పాటు సురేష్ పూజారి, బసంత పండా, సమీర్ మహంతి, నిత్యానంద గోండ్ ఉన్నారు. వీరంతా మంగళవారం మధ్యాహ్నం మాజీ ముఖ్యమంత్రిని ఆహ్వానించడానికి నవీన్ నివాస్ సందర్శించారు.

హాజరవుతానని హామీ..?

అనంతరం మీడియాతో మన్మోహన్ సామల్ మాట్లాడుతూ.. మా ఆహ్వానాన్ని నవీన్ మన్నించి వేడుకకు హాజరవుతానని హామీ ఇచ్చారని తెలిపారు. తాము రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిని కూడా సంప్రదించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఇతర సీనియర్ నాయకులను కూడా ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తామని పేర్కొన్నారు. భారత రిజర్వు బ్యాంకు గవర్నర్, జీవిత బీమా సంస్థ చైర్‌పర్సన్, ఎయిమ్స్-భువనేశ్వర్ డైరెక్టర్, ఇతర ప్రముఖులతో సహా ఢిల్లీలోని 100 మంది ఒడిశా కేడర్ ఐఏఎస్ అధికారులకు, అత్యున్నత పదవుల్లో ఉన్న ఒడియా అధికారులకు కూడా ఆహ్వానాలు పంపినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో విపక్షాలను విశ్వాసంలోకి తీసుకుని బీజేపీ ప్రభుత్వాన్ని నడుపుతుందని తెలిపారు. ఒడిశా బీజేపీ జాతీయ పరిశీలకుడు విజయ్‌పాల్ సింగ్ తోమర్ ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర శాఖ చీఫ్ నవీన్ పట్నాయక్‌ను స్వయంగా ఆహ్వానిస్తారని గతంలో ప్రకటించారు. ఒడియా ఆత్మ గౌరవం తన ప్రధాన ఎన్నికల హామీగా అధికారంలోకి వచ్చిన తమ పార్టీ పూరీ శ్రీజగన్నాథునితో సహా ఆయన తోబుట్టు దేవతల్ని తొలి ఆహ్వానితులుగా పిలుపు చేసినట్లు పేర్కొన్నారు. మరోవైపు ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రమంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా హాజరయ్యే ప్రమాణ స్వీకారోత్సవానికి వేదికైన జనతా మైదానం శోభాయమాన అలంకరణ తుది మెరుగులు దిద్దుకుంటుంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



బలిమెల ఆరోగ్య కేంద్రం వద్ద భగవాన్ మృతదేహం



సంఘటన స్థలంలో ప్రమాదానికి గురైన బైక్

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి సోమనాథపూర్ గ్రామం వద్ద సోమవారం రాత్రి బైక్ అదుపు తప్పి లోయలో పడిపోవడంతో ఒక యువకుడు దుర్మరణం పాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. కొరాపుట్ జిల్లా బైపార్‌గూడ సమితి బాలుగాం గ్రామం నుంచి సోమవారం ఉదయం మహేశ్వర్ గౌడ, భగవాన్ సొంత అనే ఇద్దరు స్నేహితులు చిత్రకొండ సమితి టోనాల్ క్యాంప్ డైక్-1లో నివాసముంటున్న మరో స్నేహితుడిని కలవడానికి వచ్చారు. రోజంతా ముగ్గురు మిత్రులు ఆనందంగా గడిపారు. అనంతరం తిరిగి బైక్‌పై భగవాన్ సొంత, మహేశ్వర్‌లు బయల్దేరారు. అయితే సోమనాథ్‌పూర్ గ్రామానికి దగ్గరలో వచ్చేటప్పటికి బైక్ అదుపు తప్పడంతో 50 అడుగుల లోతులో పడిపోయారు. సమీపంలో ఉన్న ప్రజలు వారిని అతికష్టం మీద బయటకు తీసి బలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అప్పటికే భగవాన్ సొంత మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలిసిన బలిమెల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని పరీక్షించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం ఉదయం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కడుపు నొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో ఓ యువకుడు తీవ్ర కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఒకటో పట్టణ ఎస్ఐ కామేశ్వరరావు పేర్కొన్నారు. ఎస్ఐ చెప్పిన వివరాల మేరకు.. ఏపీహెచ్‌బీ కాలనీలోని ఓ అద్దె ఇంటిలో లంకవలస అప్పన్న, కనక దంపతులు రెండేళ్లుగా నివసిస్తున్నారు. వీరు సంతోషిమాత గుడి సమీపంలో కూరగాయల మార్కెట్ నడుపుతున్నారు. వీరికి రోహిత్(22) ఒక్కడే కుమారుడు. రోహిత్ పదోతరగతి పాసైన వెంటనే నగరంలోని ఓ మెడికల్ ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా పనిచేశాడు. ఆరోగ్యం సరిగా లేకపోవడం, తరచూ కడుపు నొప్పి రావడంతో మెడికల్ ల్యాబ్‌లో మానేసి ఇంటిపట్టునే ఉండేవాడు. గత నాలుగు రోజులుగా కడుపు నొప్పి తీవ్రంగా రావడంతో 'అమ్మా నేను భరించలేకపోతున్నాను. చనిపోవాలనిపిస్తుందంటూ' తల్లి కనకతో చెప్పేవాడు. సోమవారం ఉదయం తల్లిదండ్రులిద్దరూ బయటకు వెళ్లి రాత్రి ఏడు గంటలకు వచ్చేసరికి తలుపులు బిగించి ఉన్నాయి. లోపల చూస్తే రోహిత్ సీలింగ్ ఫ్యానుకు చీరతో ఉరేసుకుని కనిపించాడు. విషయం తెలిసి రాత్రి 11 గంటలకు ఘటనాస్థలికి ఎస్ఐ కామేశ్వరరావు, ఏఎస్ఐ చేరుకుని పరిశీలించారు. మంగళవారం రిమ్స్‌లో పంచనామా నిర్వహించి రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

ఆభరణాలు చోరీ



చీడివలస గ్రామంలో దర్యాప్తు చేస్తున్న ఇన్‌చార్జి ఎస్ఐ నాగరాజు

బూర్జ: మండలంలో గల చీడివలస గ్రామంలో కోడి అప్పలనాయుడుకి చెందిన ఐదు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. అలాగే వెండి వస్తువులు సుమారు 15 తులాలు చోరీకి గురైనట్లు తెలియ జేశారు. గ్రామస్తులు, స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం రాత్రి అప్పలనాయుడు కుటుంబ సభ్యులతో ఇంటి గడపలో పడుకున్నారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఇంటిలో ఏదో అలికిడి రాగా వారు ఇంటిలోకి వెళ్లి చూశారు. వెనక తలుపులు తెరిచి ఉండడం గమనించారు. తలుపుల పక్కనున్న కిటికీ గ్రిల్స్ తీసివేసి ఉన్నాయి. ఇంటి లోపల బీరువా తెరిచి ఉంది. బీరువా అంతా పరిశీలించగా రెండున్నర తులాల బంగారం పుస్తెలతాడు, ఒక్క తులం చైను లాకెట్, అర్ధ తులం ఉంగరం, చెవిబుట్టలు అర్ధతులం, అర్ధతులం చిన్న పిల్లల వస్తువులు కనిపించలేదు. దీంతో వారు మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి ఎస్ఐ ఆమదాలవలస-2 ఐ.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలానికి క్లూస్ టీమ్ వెళ్లి పరిశీలించిందని ఆమదాలవలస సీఐ దివాకర్ యాదవ్ తెలిపారు. ఊరిలో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో జనం ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం ఏర్పాటుకు వినతి



ఒడిశాలో ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి బీజేపీ అగ్రనేతల బృందం రాజ్ భవన్‌ను మంగళవారం సందర్శించింది. ఈ సందర్భంగా గవర్నర్ రఘుబర్ దాస్‌కు ప్రభుత్వ ఏర్పాటు కోసం లేఖ అందజేసింది. ఈ బృందంలో ముఖ్యమంత్రి అభ్యర్థి మోహన్ చరణ్ మాఝి, ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్‌దేవ్ మరియు ప్రభాతి పరిడా తదితరులు ఉన్నారు.

- భువనేశ్వర్

భక్తిశ్రద్ధలతో పూజలు



జయపురం: బిజాపూర్‌లో శివ పార్వతుల వివాహం నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: ఉత్కళ ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే శీతల షష్టి, శివ పార్వతుల వివాహోత్సవాలు జయపురం, పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జయపురం రాజువీధిలోని పంచానన మందిరంలో మూడు రోజులుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం విశ్వ శాంతి కోసం మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. అలాగే బొరిగుమ్మ సమితి బిజాపూర్ శివ మందిరంలో సోమవారం రాత్రి శివ పార్వతీ వివాహ మహోత్సవాలను చేపట్టారు.

ఘనంగా శిఖర ప్రతిష్ట

కొరాపుట్: నబరంగ్‌పూర్ రాజువీధిలోని గణేష్ దేవాలయ శిఖర ప్రతిష్ట ఘనంగా జరిగింది. పురోహితుడు నర్సింగ త్రిపాఠి నేతృత్వంలో కార్యక్రమాలు చేపట్టారు. అయ్యప్ప స్వామి, విఘ్నేశ్వరుడు, కుమార స్వామి దేవాలయాలకు సామూహికంగా శిఖర ప్రతిష్టలు నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితుడు గుప్త షడంగి, దేవాలయ అధ్యక్షుడు గణేష్ దాస్, 23 మంది వేద పండితుల బృందం సభ్యులు పాల్గొన్నారు.

అగ్ని గంగమ్మ ప్రసాద సేవనం

కొరాపుట్: అగ్ని గంగమ్మ తల్లి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ప్రసాద సేవన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం కొరాపుట్ జిల్లా సిమిలిగుడ పట్టణంలో జాతీయ రహదారిపై కొలువుదీరిన అగ్ని గంగమ్మ దేవాలయం వెనుక మైదానంలో కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పాట్టంగి ఎమ్మెల్యే రాం ఖడం, మాజీ ఎమ్మెల్యేలు రఘురాం పాడాల్, పీతం పాఢి, ప్రఫుల్ల పంగి తదితరులు పాల్గొన్నారు.



కొరాపుట్: రాజ పురోహితుడు నర్సింగ త్రిపాఠి నేతృత్వంలో యజ్ఞం



కొరాపుట్: అన్న సంతర్పణలో పాల్గొన్న భక్తులు

విద్యార్థులకు అండగా ఎస్ఎఫ్ఐ



ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జీవీఎంసీ కార్పొరేటర్ గంగారావు

ఆమదాలవలస: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడేది భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ మాత్రమేనని జీవీఎంసీ కార్పొరేటర్ గంగారావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చింతాడ గ్రామం సమీపంలో గల ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు మంగళవారం నాలుగో రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గడిచిన కొన్ని దశాబ్దాలుగా పేద మధ్యతరగతి విద్యార్థులకు అండగా ఉంటూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులను సంఘటితం చేస్తూ అనేక పోరాటాలు నిర్వహించిన ఘనత ఎస్ఎఫ్ఐకి దక్కిందని అన్నారు. ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలలు సజీవంగా ఉన్నాయంటే ఎస్ఎఫ్ఐ పోరాటాల వల్లనే అని అన్నారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలని అన్నారు. నానాటికీ విద్యా ప్రమాణాలు దిగజారుతున్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.హరీష్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంటామని తెలిపారు. ఎలాంటి సమస్యలనైనా నిర్భయంగా చెప్పుకునే ఒకే ఒక్క సంఘం ఎస్ఎఫ్ఐ మాత్రమేనని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, జిల్లా అధ్యక్షుడు డి.చందు, సహాయ కార్యదర్శి సంతోష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హైవే అంబులెన్స్ ఉద్యోగి నిజాయితీ



మకరాంపురంలో మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకొన్న వ్యక్తికి ఇస్తున్న హైవే అంబులెన్స్ ఉద్యోగి దుర్గాప్రసాద్

కంచిలి: మండలంలోని మకరాంపురం గ్రామానికి చెందిన నేషనల్ హైవే అంబులెన్స్ ఉద్యోగి జల్లు దుర్గాప్రసాద్ తన నిజాయితీ నిరూపించుకున్నారు. ఆయన పలాస నుంచి వస్తున్నప్పుడు ఆర్టీసీ బస్సులో లభ్యమైన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకొన్న వ్యక్తి ఆచూకీ కనుక్కొని తిరిగి అతనికి మంగళవారం అప్పగించారు. పలాస పట్టణానికి చెందిన బొచ్చా సాయి తన మొబైల్ ఫోన్‌ను ఆర్టీసి బస్సులో వస్తున్నప్పుడు జారవిడుచుకొన్నాడు. అదే బస్సులో ప్రయాణిస్తున్న దుర్గాప్రసాద్‌కు సోమవారం ఆ మొబైల్ దొరికింది. దీంతో ఆయన ఫోన్ యజమాని వివరాలు తెలుసుకొని, సమాచారం ఇచ్చాడు. దీంతో ఆ వ్యక్తి మంగళవారం మకరాంపురం గ్రామానికి రావడంతో, అతనికి స్థానికుల సమక్షంలో హైవే అంబులెన్స్ ఉద్యోగి దుర్గాప్రసాద్ ఫోన్ అప్పగించాడు. దీంతో దుర్గాప్రసాద్ నిజాయితీని అంతా మెచ్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఎల్.ఎన్.పేట: మండల కేంద్రంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదే మండలం జాడు పేట గ్రామానికి చెందిన జమ్మాన వరప్రసాదరావు (27) మృతి చెందాడు. సరుబుజ్జిలి పోలీసు స్టేషన్ ఏఎస్ఐ చంద్రినాయుడు తెలియజేసిన వివరాలు ప్రకారం. మంగళవారం గొట్టిపల్లిలోని తన బంధువుల ఇంటిలో పరామర్శ కోసం ఆయన ఎల్ఎన్‌పేట వచ్చాడు. తన ఊరి వైపు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న సమయంలో మొబైల్ ఫుడ్ కోర్టు ఆటో వరప్రసాదరావుని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన ప్రసాదరావుని స్థానికులు 108 అంబులెన్స్‌లో రిమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుని తల్లి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య, కొడుకు ఉన్నారు. జాడుపేట గ్రామంలో విషాదం అలముకుంది.

క్లుప్తంగా

మహిళ మెడలో బంగారం చోరీ



చోరీ జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎస్సై పాపారావు

సీతానగరం: మండలంలోని జోగింపేట కాలనీలో గాఢనిద్రలో ఉన్న సమయంలో మహిళ మెడలో బంగారం వస్తువులను గుర్తు తెలియని వ్యక్తి కట్ చేసి అపహరించాడు. తన ఇంటి వరండాలో సోమవారం రాత్రి కుటుంబసభ్యులతో కలిసి నిద్రిస్తుండగా మెడలో ఉన్న వస్తువులు ఎవరో కట్ చేసి చోరీకి పాల్పడినట్లు కాలనీలో నివాసముంటున్న మరిశర్ల సుగుణ మంగళవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుమేరకు ఇన్‌చార్జి ఎస్సై పాపారావు నేరం జరిగిన స్థలాన్ని పరిశీలించిన అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్‌షెల్టర్ ఆక్రమణ



బస్‌షెల్టర్‌లో కుర్చీలు వేసుకుని కూర్చున్న ప్రైవేట్ మైనింగ్ సిబ్బంది

సాలూరు రూరల్: మండలంలోని గదబబొడ్డవలస గ్రామం వద్ద గల బస్ షెల్టర్‌ను ప్రైవేట్ మైనింగ్ ఏజెంట్లు ఆక్రమించి వారి కలెక్షన్ పాయింట్‌గా వినియోగించుకుంటున్నారు. మైనింగ్ రాయల్టీ వసూలుకు ఈ ప్రాంతంలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరు గదబ బొడ్డవలస వద్ద బస్‌షెల్టర్ లో కుర్చీలు వేసుకుని కొంతమంది సిబ్బంది కూర్చుంటున్నారు. బస్ కోసం నిరీక్షించిన ప్రయాణికులు మాత్రం బస్‌షెల్టర్ బయట నిలబడాల్సి వస్తోంది. వర్షం కురిసిన సమయంలో మహిళలు ఈ బస్ షెల్టర్‌లో నిల్చోడానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంలో వెంటనే అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

లారీ బోల్తా: డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



బైపాస్ రోడ్డు బోల్తాపడిన కర్రల బొత్తు లారీ

రామభద్రపురం: మండలకేంద్రంలోని గొర్లె వీధికి సమీపంలో బైపాస్ రోడ్డుపై మంగళవారం ప్రమాదవశాత్తు బొత్తు లారీ బోల్తాపడడంతో లారీ డ్రైవర్ సామిరెడ్డి రాంబాబుకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గుర్తించి ప్రథమ చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు.డ్రైవర్ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం విశాఖపట్నం నుంచి రాయగడకు కర్రల బొత్తు తీసుకెళ్తున్నాడు. రామభద్రపురం బైపాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయే క్రమంలో లారీ బోల్తా పడింది. తనకు, క్లీనర్‌కు ప్రాణాపాయ ఘటన జరగకపోవడం అదృష్టమని డ్రైవర్ తెలిపాడు.

రెండు టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత



మిల్లు గోదాంలో పట్టుకున్న పీడీఎస్ బియ్యం బస్తాలతో వీఆర్వో వాసు

గంట్యాడ: గంట్యాడ మండలంలో రెండు టన్నుల పీడీఎస్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వ్యాపారులు పెద్ద ఎత్తున పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి చంద్రంపేట గ్రామంలో ఉన్న మణికంఠ రైస్ మిల్లు గోదాంకు మంగళవారం రాత్రి తరలించారు. ఈవిషయం రెవెన్యూ అధికారులకు తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకుని మిల్లు గోదాంలో ఉన్న సుమారు రెండు టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని గోదాం సీజ్ చేశారు.

ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం రేపు

సాలూరు: పట్టణంలోని తోటవీధిలో గల నవజీవన్ ఆశ్రమంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకురాలు చిన్నమ్మలు ఓ ప్రకటనలో తెలిపారు.ఐఎంఏ విజయనగరం వారి సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో 25 సంవత్సరాలు పై బడిన స్త్రీలకు రొమ్ముక్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ ఇతర కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నారని పేర్కొన్నారు. పురుషులు, పిల్లలకు ఉచిత వైద్యపరీక్షలు చేస్తారని స్పష్టం చేశారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

- ఒంటి నిండా గాయాలతో కొండపైన మృతదేహం లభ్యం
- స్నేహితులే చంపారంటున్న స్థానికులు, బంధువులు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ శ్రీనివాసరావు



కారెపు చైతన్య (ఫైల్)



మృతదేహం వద్ద ఆధారాలు వెతుకున్న పోలీసులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని తూర్పు మహారాజుపేట(కొండపేట)లో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం స్థానికంగా సంచలనం రేకెత్తించింది. కొండపేటకు చెందిన కారెపు చైతన్య(16) గ్రామం సమీపంలోని తుప్పల్లో విగత జీవిగా పడి ఉండడం, శరీరంపై గాయాలు ఉండడాన్ని బట్టి హత్యగా భావిస్తున్నారు. అయితే ఈ హత్యకు కారణాలేంటి? హంతకులు ఎవరు? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. చైతన్య పదోతరగతి పరీక్షల్లో (సప్లిమెంటరీ) పాసై ఇంటర్ మీడియట్‌లో ప్రవేశానికి సన్నద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఇంటికి రాలేదు. దీంతో తల్లి భారతి వీధిలో వాకబు చేసింది. అయినప్పటికీ రాత్రివరకు ఆచూకీ తెలియకపోవడంతో బంధువుల సహాయంతో గ్రామ పరిసరాల్లో వెతికినప్పటికీ ప్రయోజనం లేక పోయింది. ఈ క్రమంలో చైతన్య మంగళవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో కొండపేటను అనుకుని ఉన్న కొండపై విగతజీవిగా కనిపించాడు. శరీరమంతా గాయాలు ఉన్నాయి. దీంతో స్నేహితులే చైతన్యను హత్యచేసి ఉంటారని స్థానికులు, బంధువులు అనుమానిస్తున్నారు. మద్యం, గంజాయి మత్తులో ఈ ఘాతుకానికి పాల్పడి ఉండవచ్చునని చెబుతున్నారు. మృతదేహం వద్ద రక్తపు మరకలతో కూడిన రాళ్లు లభ్యం కావడంతో ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ముఖంపైనా, తల వెనుక గాయాలు ఉండడం స్థానికుల వాదనకు బలం చేకూరుస్తోంది.

దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

డాగ్ స్క్వాడ్‌తో కలిసి క్లూస్ టీమ్ సంఘటన స్థలాన్ని పరిశీలించింది. బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు, విజయనగరం టూ టౌన్ సీఐ రామారావు, ఎస్సై దుర్గాప్రసాద్, డెంకాడ ఎస్సై కృష్ణమూర్తి సంఘటనా స్థలానికి చేరుకుని, స్థానికులను ఆరాతీశారు. సోమవారం మధ్యాహ్నం నెల్లిమర్ల వెళ్లి వచ్చిన చైతన్య ఆ తరువాత కనిపించలేదని కుటుంబసభ్యులు చెప్పారు. ఆధారాల సేకరణ అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి పోలీసులు తరలించారు. ఇదిలా ఉంటే బాలుడి తండ్రి గతంలోనే మృతిచెందాడు. తల్లి భారతి, అక్క జయశ్రీ ఉన్నారు. చేతికందిన కొడుకు మృతి చెందడంతో తల్లి, అక్క, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

గ్రోత్ సెంటర్‌కు మహర్దశ

- అభివృద్ధి పనులకు రూ.7 కోట్లతో ప్రతిపాదనలు
- ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ హరిధర రావు



మాట్లాడుతున్న హరిధర రావు



గ్రోత్ సెంటర్‌లో రోడ్ల కొలతలు తీసే కార్యక్రమంలో ఏపీఐఐసీ అధికారులు

బొబ్బిలి: ఉత్తరాంధ్రలో చిన్న పరిశ్రమలకు ఆలవాలమైన బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో అంతర్గత రహదారులు, ప్రధాన రహదారులతో పాటు, స్ట్రీట్ లైట్ల ఏర్పాటుకు రూ.7కోట్లతో ప్రతిపాదనలు చేస్తున్నట్లు ఏపీఐఐసీ శ్రీకాకుళం జోనల్ డిప్యూటీ మేనేజర్ బడగల హరిధర రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన గ్రోత్ సెంటర్‌లోని ప్రధాన రహదారులు, అంతర్గత రహదారుల మరమ్మతులు, నిర్మాణాలకు అవసరమైన కొలతలు తీయించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ ఆరు నెలల క్రితం రూ.4కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసినట్లు చెప్పారు. అయితే ఆ వెంటనే ఎన్నికల కోడ్ రావడంతో నిధులు మంజూరు చేయలేదన్నారు. ప్రస్తుతం మైక్రో స్మాల్ ఎంటర్‌ప్రెన్యూర్స్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎంఎస్ఈసీడీపీ)కింద రూ.7 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని, గ్రోత్ సెంటర్‌లో 5 కిలోమీటర్ల పరిధిలోని నాలుగు ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులతో పాటు వీధి లైట్లు ప్రతిపాదిత నిధులతో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వాటితో పాటు మూడు కూడళ్ల వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 40శాతం, కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు ఇందుకు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు సిద్ధంగా ఉన్నాయని, కేంద్రం పరిశ్రమల కేంద్రాలకు వసతుల కోసం చేసే ఖర్చులకు మూడు నెలలకోసారి కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోనుందన్నారు.

త్వరలో పనుల ప్రారంభం

నిధులు మంజూరైతే త్వరలోనే పనులు ప్రారంభిస్తామని డిప్యూటీ జోనల్ మేనేజర్ హరిధర రావు తెలిపారు. గ్రోత్ సెంటర్‌లో 50 టన్నుల పైచిలుకు బరువున్న వాహనాలు తిరుగుతున్న నేపథ్యంలో రహదారులు పాడయ్యాయి. ఎప్పుడో 30 ఏళ్ల ముందు నిర్మించిన రహదారులే ఉండడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇప్పుడు మరోసారి ప్రతిపాదనలు చేయనుండడంతో గ్రోత్ సెంటర్‌లో సౌకర్యాలు పెరగనున్నాయని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు వ్యాఖ్యానిస్తున్నారు.

రోడ్డు ప్రమాద బాధితురాలికి ఆర్థిక సాయం



వెంకటలక్ష్మి కుటుంబసభ్యులకు సాయాన్ని అందజేస్తున్న సేవా సమితి ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విజయనగరం జిల్లా గుర్ల మండలం భూపాలపురం గ్రామానికి చెందిన నైదాన వెంకటలక్ష్మికి శ్రీకాకుళం జిల్లా పూండికి చెందిన యువతరం సేవా సమితి సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. ఆమెకు అండగా నిలవాలని భావించిన సమితి సేవాసభ్యులు రూ.30 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని తీసుకుని బాధితురాలు చికిత్స పొందుతున్న విజయనగరంలోని ఆస్పత్రికి మంగళవారం వెళ్లి ఆమె కుటుంబసభ్యులకు సొమ్ము అందజేశారు. వెంకటలక్ష్మి ఇటీవల బంధువుల ఇంట్లో శుభ కార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదానికి గురై తలకు తీవ్రమైన గాయం కావడంతోపాటు ముఖం నుజ్జునుజ్జయింది. దీంతో ఆపరేషన్‌కు రూ.6 లక్షలు అవసరం కావడంతో నిరుపేదలైన ఆమె తల్లిదండ్రులు దాతల సహాయం కోరారు. ఈ మేరకు పెందుర్తికి చెందిన (వీబీపీ)హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ రూ.5 వేలు అందించగా ఆ సొమ్ముతో పాటు యువతరం సేవా సమితి ఆర్థిక సహాయం అందించింది. కార్యక్రమంలో సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చింత మురళి, సమితి ప్రతినిధులు గొరకల సునీల్, అన్నెపు లక్ష్మణరావు పాల్గొన్నారు.

15న వాలీబాల్ శిక్షణకు ఎంపికలు

విజయనగరం: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వాలీబాల్ శిక్షణ శిబిరంలో శిక్షణ పొందేందుకు అర్హత గల బాలుర అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఈనెల 15న విశాఖలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధి కేవీఏఎన్ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు విశాఖ పోర్టు స్టేడియంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే అభ్యర్థులు 18 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలని స్పష్టం చేశారు. ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు అత్యుత్తమ క్రీడా వసతులతో పాటు నిష్ణాతులైన శిక్షకులతో వాలీబాల్ క్రీడాంశంలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే విద్యార్థులు వయస్సు నిర్ధారణ ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్‌కార్డు, క్రీడలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను వెంట తీసుకువెళ్లాలని సూచించారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

కంటోన్మెంట్‌లో చోరీ

విజయనగరం క్రైమ్: స్థానిక కంటోన్మెంట్‌లో దిశ పోలీస్ స్టేషన్ సమీపంలో ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడి బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను దోచుకుపోయారు. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. దిశ పోలీస్‌స్టేషన్ సమీపంలో నివాసం ఉంటున్న దంతులూరి గౌతమ్ వర్మ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. రెండురోజుల క్రితం తన పనినిమిత్తం హైదరాబాద్ వెళ్లారు. మంగళవారం తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు విరగ్గొట్టి, గదులన్నీ చిందరవందరగా కనిపించాయి. బీరువాలో ఉన్న నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలను, విలువైన వస్తువులను దొంగలు దోచుకుపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో క్లూస్ టీమ్ రంగంలోకి దిగి, పలు ఆధారాలను సేకరించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై నరేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ఘటాలతో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారు మంగళవారం చదురుగుడి, వనంగుడిలలో పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ నేతృత్వంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావు, వెలువలపల్లి నరసింహమూర్తిలు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీవీ ప్రసాదరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తరించారు.

రాష్ట్రాన్ని బాల కార్మిక రహితంగా తీర్చిదిద్దాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కేసలి అప్పారావు తదితరులు

- బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర చైర్మన్ అప్పారావు

విజయనగరం ఫోర్ట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని బాల కార్మిక రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. ఈ మేరకు విజయనగరంలోని తోటపాలెంలో గల ఆయన క్యాంప్ కార్యాలయంలో విజయవాడకు చెందిన క్రాఫ్ సంస్థ రుపొందించిన వాల్ పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు అందరూ పాఠశాలల్లో విద్యను అభ్యసించాలని పిలుపునిచ్చారు. ఏ ఒక్కరినైనా బాల కార్మికులను పనిలో గాని, ప్రమాద భరిత రంగాల్లో గానీ పెట్టుకుంటే సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బాలలతో, బాలల కోసం పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రతినిధులు రాష్ట్రంలో బాల కార్మికుల లేకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అంగన్‌వాడీ, సచివాలయం, కార్మికశాఖ, పోలీసుశాఖ, రైల్వే శాఖ, మున్సిపల్, పంచాయతీ, రెవెన్యూశాఖల భాగస్వామ్యంతో పూర్తిస్థాయిలో బాల కార్మిక వ్యవస్థను రూపుమాపాలని సూచించారు, కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీసీపీయూ యాళ్ల నాగరాజు, డీసీపీయూ సిబ్బంది బి. రామకోటి, వెన్నెల సంధ్య, చైల్డ్‌లైన్ సిబ్బంది చప్ప అరుణ్‌కుమార్, వి.మీనా, జి. ఝాన్సీరాణి, ఫల్గుణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల ఉద్యోగులకు న్యాయం చేయాలి



పెదమానాపురం ప్రభుత్వ మద్యం దుకాణం ముందు నిరసన తెలియ చేస్తున్న ఉద్యోగులు

దత్తిరాజేరు: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మద్యం దుకాణాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు న్యాయం చేయాలని దత్తిరాజేరు మండలంలోని పెదమానాపురం మద్యం షాపు ముందు మంగళవారం ఉదయం పలువురు ఉద్యోగులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు వేమన,సోమేష్, తిరుపతి, మహదేవ్ ఉమ కృష్ణ,రమేష్, కొన్న కృష్ణ, తదితరులు మాట్లాడుతూ 2019లో అప్పటి ప్రభుత్వం ప్రైవేట్ మద్యం దుకాణాలను రద్దు చేసి ప్రభుత్వం తరఫున అమ్మకాలు చేయడానికి నిర్ణయం తీసుకుని అర్హతను బట్టి ఉద్యోగ నియామకాలు జరపగా రాష్ట్రవ్యాప్తంగా 18వేల మంది ఉపాధి పొందడంతో తమ కుటుంబాలు జీవనం సాగిస్తున్నయన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రభుత్వం మద్యం దుకాణాలను రద్దు చేసి పాత పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులకు టెండర్ల ద్వారా కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తోందన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, మద్యం దుకాణాలు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న 18వేల మంది కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్హత, సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని తమను మరో డిపార్ట్‌మెంట్‌లో సేవలకు వినియోగించుకుని న్యాయం చేయాలని కోరారు.

సమ్మె విరమణ



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న నాయకులు

సాలూరు: తమ సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు సమ్మె విరమించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ప్రసన్నవాణి మంగళవారం తన కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎన్‌వై నాయుడు, రాముడు, శంకర్రావు తదితరులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు బకాయి వేతనాల చెల్లింపు, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మె విరమించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాలు దక్కించుకున్నారు. ఈనెల 8,9 తేదీల్లో విశాఖలో జరిగిన పోటీల్లో ఎస్.రామకృష్ణ 83 కేజీల విభాగంలో ఒక బంగారు, రెండు వెండిపతకాలు దక్కించుకున్నాడు. అదేవిధంగా ఎ.రాజా 64 కేజీల విభాగంలో రెండు బంగారు పతకాలు, ఒక కాంస్య పతకం కైవసం చేసుకోగా..కె.జగదీష్ 59 కేజీల విభాగంలో మూడు బంగారు పతకాలు దక్కించుకున్నాడు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

ఆరోగ్యానికి పైనాపిల్ దోహదం

- పండులో మినరల్స్ ఎక్కువే
- తింటే ఒత్తిడి దూరం



పైనాపిల్

పండులో పోషకాలు (ప్రతి వంద గ్రాములకు)..	
నీరు	87.8 గ్రాములు
ప్రొటీన్‌లు	0.4 గ్రాములు
కొవ్వు	0.1 గ్రాములు
పిండి పదార్థం	10.8 గ్రాములు
కాల్షియం	20 మి.గ్రాములు
ఫాస్ఫరస్	9 మి. గ్రాములు
ఇనుము	2.4 మి. గ్రాములు
సోడియం	34.7మి.గ్రాములు
పొటాషియం	37 మి.గ్రాములు
మాంగనిస్	0.56 మి. గ్రాములు
శక్తి	46 కిలో కాలరీలు

ఆరోగ్యానికి మేలు



పైనాపిల్‌లో మినరల్స్ అధికంగా ఉంటాయి కాబట్టి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఒక కప్పు తాజా పైనాపిల్ రసంలో 131 శాతం విటమిన్-సి, 2 శాతం విటమిన్ ఎ, 2 శాతం కాల్షియం, 2 శాతం ఐరన్ ఉంటాయి. ఈ సీజన్‌లో వచ్చే పైనాపిల్ తినడం వల్ల చాలా ప్రయోజనాలున్నాయి. ఫైబర్, పొటాషియం, విటమిన్ సి ఉంటాయి కాబట్టి గుండెకు కూడా మంచిదే.

– భానుప్రతాప్, వైద్యాధికారి, దోనుబాయి

సీతంపేట: ఈ సీజన్‌లో అత్యధికంగా ఏజెన్సీలో లభించే పండ్ల జాతుల్లో పైనాపిల్ ఒకటి. పైనాపిల్ తీసుకోవడం వల్ల ఎన్నో లాభాలుంటాయని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. పైనాపిల్‌లో ఉండే పొటాషియం, సోడియం నిలవ్లు ఒత్తిడి, ఆందోళనల నుంచి రక్షణ ఇస్తాయి. మలబద్ధకం, పచ్చకామెర్లు వంటి వ్యాధులకు పైనాపిల్ దివ్యౌషధమైనే చెప్పుకోవాలి.

పైనాపిల్‌తో ఉపయోగాలు

- పైనాపిల్ రసంలో పంచదార కలిపి సేవిస్తే అతిదాహం నుంచి ఉపశమనం కలుగుతుంది. ఈ రసం వడదెబ్బ తగలకుండా కాపాడుతుంది.
- పుల్లగా..తీయగా ఉండే పైనాపిల్‌లో పొటాషియం, సోడియం నిలవ్లు అధికంగా ఉంటాయి. ఇవి ఒత్తిడి, ఆందోళన రాకుండా కాపాడతాయి.
- అధిక రక్తపోటు నియంత్రణ
- ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కంటి సమస్యల్ని దూరం చేస్తాయి.
- పైనాపిల్‌లో 'సి' విటమిన్ పుష్కలంగా లభిస్తుంది. ఇది మధుమేహం, అధిక రక్తపోటు, హృదయ సంబంధ వ్యాధులు, క్యాన్సర్ కారకాలైన ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతుంది.

జీర్ణక్రియ మెరుగుపడడానికి తోడ్పాటు

- చర్మ నిగారింపును పెంచే ఎంజైమ్‌లు పైనాపిల్‌లో ఉన్నాయి.
- పైనాపిల్ తీసుకోవడం వల్ల పొగతాగడం వల్ల వచ్చే అనర్థాలు తగ్గిపోతాయి.
- పైనాపిల్ రసాన్ని తాగితే వాంతులు తగ్గుతాయి.
- పచ్చకామెర్లతో బాధపడుతున్న వారికి ఈ రసం ఎంతో మేలు చేస్తుంది.
- పైనాపిల్‌లో ఉన్న ఫైబర్ మలబద్ధకం తగ్గించడానికి సహాయపడుతుంది.
- జుట్టు రాలడాన్ని తగ్గించడంలో ఈ ఫలం సహాయపడుతుంది.

ఏపీజీవీబీ రుణలక్ష్యం రూ.40 కోట్లు



మాట్లాడుతున్న ఏపీజీవీబీ రీజనల్ మేనేజర్ రామకృష్ణరాజు

రామభద్రపురం: జిల్లాలో ఈ ఏడాది వ్యవసాయ, అనుబంధ రంగాలకు ఏపీజీవీబీ నుంచి రూ.40 కోట్ల రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఏపీజీవీబీ ఆర్ఎం రామకృష్ణరాజు తెలిపారు. రామభద్రపురం మండల కేంద్రంలో సాలూరు రూట్‌లో ఉన్న ఏపీజీవీబీ బ్రాంచ్‌ను స్టేట్‌బ్యాంకు పక్కన ఉన్న నూతన భవనంలోకి మార్చారు. నూతన భవనాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖాతాదారులు, రైతులతో మాట్లాడుతూ రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలు ఏడాదిలోపు చెల్లిస్తే ఏడు శాతం వడ్డీ మాత్రమే వసూలు చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇన్సెంటివ్ రూపంలో ఆ వడ్డీని తిరిగి చెల్లిస్తాయని చెప్పారు. మహిళలు, యువత ఆర్థికాభివృద్ధి చెందేందుకు చిన్నచిన్న పరిశ్రమల ఏర్పాటుతో పాటు అన్నిరకాల రుణాలు ఇవ్వనున్నామన్నారు. డిపాజిట్లపై మిగిలిన బ్యాంకుల కంటే ఏపీజీవీబీలలో అధిక వడ్డీ ఇస్తున్నట్టు వెల్లడించారు. గృహ రుణాలతో పాటు బంగారు ఆభరణములపై తక్కువ వడ్డీకే రుణాలు అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు సునీల్ వర్మ, గణేష్, యూనియన్ జనరల్ సెక్రటరీ అప్పలనాయుడు, బ్రాంచ్ మేనేజర్ విజయ్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ గౌరీపతి, తదితరులు పాల్గొన్నారు.